గ్రంథాలయాన్ని తనిఖీ చేసిన వైరా ఎమ్మెల్యే

గ్రంథాలయ భవనాన్ని పరిశీలిస్తున్న వైరా ఎమ్మెల్యే

వైరా టౌన్, జూలై 9: వైరా గ్రంథాలయాన్ని ఎమ్మెల్యే మాలోతు రాందాస్‌నాయక్, జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు పువ్వాళ్ళ దుర్గాప్రసాద్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న వారికి వసతులు ఉన్నాయా.. బిల్డింగ్ పరిస్థితిపై ఆరా తీశారు. అనంతరం గ్రంథాలయంలో వసతులు కల్పించాలని అధికారులకు సూచనలు చేశారు.

హోంగార్డ్ ఆఫీసర్లకు ఆర్థిక సాయం అందజేత

మామిళ్లగూడెం, జూలై 9: జిల్లాలోని హోంగార్డు ఆఫీసర్లకు సీపీ సునీల్‌దత్ మంగళవారం ఆర్థిక సాయాన్ని అందజేశారు. అనారోగ్య సమస్యలతో ఇబ్బందులు ఎదుర్కొన్న హోంగార్డులకు, కుమార్తెల వివాహాల కోసం సాయం అవసరమైన హోంగార్డులకు సీపీ ఈ సాయం చెక్కులను ఖమ్మంలోని తన కార్యాలయంలో అందజేశారు. చెక్కులు అందుకున్న వారిలో హోంగార్డు ఆఫీసర్లు వెంకటేశ్వర్లు, ఉపేందర్, నవీన్, కోటేశ్వరరావు, కిషన్ ఉన్నారు. ఏఆర్ ఏసీపీ సుశీల్ సింగ్, ఆర్ఐ సురేష్, హోంగార్డు అసోసియేషన్ భాద్యులు పాల్గొన్నారు.

'అవహేళనగా మాట్లాడిన వ్యక్తిపై చర్యలు తీసుకోవాలి'

మామిళ్లగూడెం, జూలై 9: పురోహితుల పట్ల అవహేళనగా మాట్లాడిన వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని ఖమ్మం నగర పురోహిత సంఘం అధ్యక్షుడు మారుతి వీరభద్ర ప్రసాద్ డిమాండ్ చేశారు. ఈ మేరకు సంఘం ఆధ్వర్యంలో ఖమ్మం వన్‌టౌన్ ఎస్ఐ సాయికుమార్‌కి మంగళవారం వినతిపత్రం అందజేశారు. నాయకులు పాల్గొన్నారు.

ఖమ్మం పెద్దాసుపత్రిలో సదరం సక్సెస్

ఖమ్మం సిటీ, జూలై 9: జిల్లాలోని దివ్యాంగులకు అర్హత సర్టిఫికెట్స్ జారీ నిమిత్తం మంగళవారం జిల్లా సార్వజనీన ఆసుపత్రిలో నిర్వహించిన సదరం క్యాంప్ సక్సెస్ అయ్యింది. స్థానిక వైద్యాధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆర్థో విభాగం– 63, అంధత్వం– 16, మానసిక వైకల్యం– 31, విజువల్– 09 కలిపి మొత్తం 119 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. వారిలో 80 మందిని అర్హులుగా తేల్చగా, 39 మందిని రిజక్ట్ చేశారు. కాగా జిల్లా వ్యాప్తంగా అన్ని విభాగాలు కలిపి 160 మంది స్లాట్ బుక్ చేసుకోగా, 126 మంది హాజరు, 33 మంది గైర్హాజరయ్యారు. గతంలో రిజక్ట్ అయిన వారు 7 గురికి తిరిగి సదరం క్యాంప్‌లో అవకాశం కల్పించారు. వైద్య పరీక్షలను పెద్దాసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కిరణ్‌కుమార్, సూచించిన విభాగాల ప్రొఫెసర్లు, అసిస్టెంట్ ప్రొఫెసర్లు పర్యవేక్షించారు.

తల్లాడలో మొహర్రం వేడుకలు ప్రారంభం

సత్తుపల్లి, జూలై 9: తల్లాడలోని పాత తహసీల్దార్ కార్యాలయం సమీపంలో ముస్లింల కోసం నూతనంగా నిర్మించిన పీర్ల చావిడిలో మొహర్రం వేడుకలను రాయల తిరుమలయ్య మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీపీ దొడ్డ శ్రీనివాసరావు, వివిధ పార్టీల నాయకులు గోపిశెట్టి వెంకటేశ్వరరావు, రాయల రాము, గుంటుపల్లి వెంకటయ్య, గరిడేపల్లి వెంకటేశ్వరరావు, వ్యాపారస్తులు నంబూరి మోహన్‌రావు, నంబూరి నారాయణరావు హాజరై హస్సేన్, హుస్సేన్‌లకు ప్రత్యేక పూజలు చేశారు.

ఏడో రోజుకు చేరిన న్యాయవాదుల రిలే దీక్షలు

ఖమ్మంలో రిలే దీక్షలో కూర్చున్న న్యాయవాదులు

ఖమ్మం లీగల్, జూలై 9: ఖమ్మం బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మూడు క్రిమినల్ చట్టాలకు వ్యతిరేకంగా ఖమ్మం కోర్టు ఎదుట న్యాయవాదులు చేస్తున్న రిలే నిరాహార దీక్షలు 7వ రోజుకు చేరాయి. మంగళవారం దీక్షల్లో సీనియర్ న్యాయవాది వడ్లెల్లి కృష్ణమూర్తి, వంజాకుల లక్ష్మీనారాయణ, సీహెచ్ ముక్తేశ్వరరావు, రెంటాల ఆనంద్, చంద్రశేఖర్, నజీమా కూర్చున్నారు. ఈ దీక్షలకు పలువురు న్యాయవాదులు, డాక్టర్లు సంఘీభావం తెలిపారు.

PUBLIC NOTICE

Under the instructions of my client M/S Shriram Finance Ltd, **KALLUR** Branch Rep. by its Branch Manager it is stated that **Smt. RESU ANITHA** W/o. Venkatesh, Aged : 34Years, **OCC:** House wife, **R/o.** Kalluru Village and Mandal, Khammam District is creating mortgage against her property shown below as security for the proposed trade Loan. If anybody having any objection they can send the objections to me or to my client within **3** days from the date of publication of this notice and further objections if any shall not bind my client.

PROPERTY TO BE MORTGAGED

Iron sheet roofed house bearing H.No.3-192/1/2, with a plinth area of 180 Sq.yards along with its House site to an extent of 157.3 Sq.Yards (131.52) Sq.Meters) situated at Pullaiah Banjar road, Kalluru Village and Mandal, Khammam District, SRO limts of Kalluru, bounded by : **EAST :** House of Seelam Subbamma, **WEST :** Gramapanchayath Road, **NORTH :** Place of Syed Nabi, **SOUTH :** House of Resu Bhadraiah.

PALIVELA GANESH BABU
Advocate, Kothagudem, Bhadradri Kothagudem Dist.,Cell:9849246278
Kothagudem Dt:07.07.2024

మన రాష్ట్రం మన పత్రిక
నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్ Classifieds

CHANGE OF NAME

I, **NIDIKONDA SREENU** CHANGED MY NAME AS **NIDIKONDA SRINU** S/O. NIDIKONDA RAMULU, R/O. FNO.104, RENUKA APARTMENT, GOLLAGUDEM, PALVANCHA, 507115, BK DIST. KMM

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచింపడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

మెగా వైద్య శిబిరం

వైరా రూరల్, జూలై 9: మండలంలోని అష్టగుర్తి గ్రామంలో గుమ్మా రోశయ్య ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించారు. యశోద హాస్పిటల్ హైదరాబాద్, శరత్ మాక్స్‌విజన్ ఐ హాస్పిటల్ ఖమ్మం వారి సహకారంతో ఉచిత పరీక్షలు చేశారు. అంకురా వైద్యశాల వైద్యులు చిన్న పిల్లలకు పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు.

టీచర్లకు సన్మానం

సత్తుపల్లి, జూలై 9: పట్టణంలోని గాంధీనగర్ ప్రాథమిక పాఠశాల నుంచి బదిలీపై వెళ్తున్న ఉపాధ్యాయులను ఎంఈవో రాములు మంగళవారం పాఠశాలలో సన్మానించారు. ఉపాధ్యాయులు బీతిని నర్సింహారావు, కంకటి వెంకటేశ్వరరావు ఉద్యోగోన్నతిపై వెళ్లారు. భాగ్యలక్ష్మి, కేహెచ్‌వై కుమారి, కంభంపాటి వెంకటేశ్ బదిలీపై వేరే పాఠశాలలకు వెళ్లారు. వీరందరినీ హెచ్ఎం చక్రపాణి, ఎంఈవో రాములు, ఎన్‌వో రాజేశ్వరరావు, కాంప్లెక్స్ హెచ్ఎం యాకుబ్ మంగళవారం సత్కరించారు.

రామారావుకు 17వ స్థానం

కొణిజర్ల, జూలై 9: తెలంగాణ ప్రభుత్వం ఇటీవల ప్రకటించిన టీజీపీఎస్‌సీజేఎల్ (జూనియర్ లెక్చరర్) ఫలితాల్లో కొణిజర్ల సమత స్కూల్ పూర్వ విద్యార్థి తాతా రామారావు జోనల్ లెవల్ 17వ స్థానం సాధించారు. ఈ సందర్భంగా ఆయనను సమత సూపర్‌జేమ్స్ ప్రిన్సిపాల్ కొనతం ఉమాశంకర్ అభినందించారు. డీఎల్ ఫలితాల్లో కూడా రామారావు ఉద్యోగం సాధించారు.

వైరా టౌన్, తిరుమలాయపాలెం, కొణిజర్ల మండలాల్లోని పలు తండాల్లో సంప్రదాయబద్ధంగా సీత్లా భవానీ వేడుకలు నిర్వహిస్తున్న గిరిజనులు

ప్రకృతి పండుగ 'సీత్లా'

రఘునాథపాలెం: సీత్లా వద్ద మొక్కులు చెల్లించుకుంటున్న గిరిజనులు

వర్షాలు సమృద్ధిగా కురవాలని, పశుపక్షాదులు సుభిక్షంగా ఉండాలని కాంక్షిస్తూ ప్రతిఏటా ఆషాఢమాసంలో గిరిజనులు సంప్రదాయ బద్ధంగా నిర్వహించే సీత్లా భవానీ పండుగను మంగళవారం జిల్లాలోని పలు మండలాల్లో ఘనంగా నిర్వహించారు. ప్రకృతితో ముడిపడి ఉన్న ఈ పండుగను గిరిజనులు సంప్రదాయ వస్త్రాలు ధరించి గ్రామదేవతకు మొక్కులు చెల్లించడం ఆనవాయితీ. గ్రామ పొలిమేర్లలో ఉండే సీత్లా భవానీ విగ్రహాలకు తాండాలలోని గిరిజనులంతా ఆనవాయితీగా డప్పువాయిద్యాలతో ఆనందోత్సహాల మధ్య మొక్కులు చెల్లించారు. **–కొణిజర్ల/ రఘునాథపాలెం/ వైరా టౌన్/ తిరుమలాయపాలెం, జూలై 9**

ప్రభుత్వ ప్రాధాన్య కార్యక్రమాలపై..

ప్రత్యేక దృష్టి సారించాలి

- వీడియో కాన్ఫరెన్స్‌లో సీఎస్ శాంతికుమారి
- ప్రథమ ప్రాధాన్యం ఇస్తున్నాం: కలెక్టర్

సీఎస్ వీడియో కాన్ఫరెన్స్‌లో ఖమ్మం నుంచి మాట్లాడుతున్న కలెక్టర్ ఖాన్

మామిళ్లగూడెం, జూలై 9: ప్రభుత్వ ప్రాధాన్య కార్యక్రమాలపై ప్రత్యేక దృష్టి సారించాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి అధికారులకు సూచించారు. రాష్ట్రస్థాయి ఉన్నత అధికారులతో కలిసి వివిధ ప్రభుత్వ ప్రాధాన్య కార్యక్రమాల అమలుపై జిల్లాల కలెక్టర్లతో హైదరాబాద్ నుంచి మంగళవారం నిర్వహించిన వీడియోకాన్ఫరెన్స్‌లో ఆమె మాట్లాడారు. ప్రభుత్వ ప్రాధాన్య కార్యక్రమాలకు ప్రథమ ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. ఖమ్మం నుంచి కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ మాట్లాడుతూ.. వన మహోత్సవంలో జిల్లాలో మొక్కలు నాటుతున్నామని, పాఠశాలల్లో కిచెన్ గార్డెన్ల కింద జిల్లాలో 50 పాఠశాలలు గుర్తించి మొక్కలు నాటుతున్నామని తెలిపారు. వారంలోగా లక్ష్యం మేరకు మొక్కలు నాటడం పూర్తి చేస్తామన్నారు. అమ్మ ఆదర్శ పాఠశాలల పనులు వేగంగా పూర్తి చేస్తామన్నారు. జిల్లాలో సీజనల్ వ్యాధుల నియంత్రణకు హాట్ స్పాట్‌లు గుర్తించి ముందస్తుగా కట్టడి చేస్తున్నట్లు తెలిపారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా నుంచి ఉన్నతాధికారులు అభిషేక్, సిద్ధార్థ్ విక్రమ్‌సింగ్, మధుసూదన్‌నాయక్, సన్యాసయ్య, వినోద్, శ్రీనివాస్, హరికిషన్, మాలతి, సోమశేఖరశర్మ, విజయలక్ష్మి, వెంకట్రామ్, వెంకట్‌రెడ్డి, అరుణ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో మాజీ ఉప సర్పంచ్ మృతి

కొండా (ఫైల్)

బోనకల్లు, జూలై 9: రోడ్డు ప్రమాదంలో మాజీ ఉప సర్పంచ్ మృతిచెందిన ఘటన మండలంలోని రావినూతల గ్రామంలో మంగళవారం చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. రావినూతల మాజీ ఉప సర్పంచ్ బోయినపల్లి కొండా (45) మంగళవారం ఉదయం తన పొలం వద్దకు వెళ్లి బైకుపై తిరిగి ఇంటికి వస్తున్నాడు. బోనకల్లు – వైరా ప్రధాన రోడ్డు మార్గంలో గల ఎస్టీ తండా వద్దకు చేరుకున్నాడు. అదే సమయంలో రావినూతల వైపు నుంచి జానకీపురం వైపు అతివేగంతో ఎజాక్స్ కాంక్రీట్ మిక్సింగ్ వాహనం వెళ్తోంది. అయితే దాని డ్రైవర్ అదే రోడ్డుపై ముందు భాగాన వెళ్తున్న రెండు అరకలు తప్పించబోయి ఎదురుగా బైకుపై వస్తున్న కొండాను ఢీకొట్టాడు. అంతేగాక అతడి బైకు పైనుంచి తన కాంక్రీట్ మిక్సింగ్ వాహనాన్ని నడిపాడు. దీంతో కొండా ఆ వాహనం కింద నలిగి అక్కడికక్కడే మృతిచెందాడు. అయితే తమ కళ్లముందే ఈ ఘటన జరగడంతో స్థానికులు ఒక్కసారిగా భయాందోళనకు గురయ్యారు. అయితే, అంతటితో ఆగని ఆ కాంక్రీట్ మిక్సింగ్ వాహనం.. నేరుగా వెళ్లి విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టి నిలిచింది. కాగా, పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని పరిస్థితిని పరిశీలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై మధుబాబు తెలిపారు. పోస్టుమార్టం నిమిత్తం కొండా మృతదేహాన్ని మధిర ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుడికి భార్య, కుమార్తె ఉన్నారు.

శోకసంద్రంలో రావినూతల..

గ్రామంలో నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటూ, గ్రామస్తుల సమస్యల పరిష్కారానికి చొరవ తీసుకుంటూ ఉండే కొండా మృతిచెందడంతో గ్రామం శోకసంద్రంలో మునిగింది. కాగా, జడ్పీ చైర్మన్ లింగాల కమల్‌రాజు ఈ గ్రామానికి చేరుకొని అతడి మృతదేహానికి నివాళులర్పించారు. నివాళులు అర్పించిన వారిలో వివిధ పార్టీల నాయకులు కొమ్మినేని ఉపేందర్, బాణోతు కొండా, పోటు వెంకటేశ్వర్లు, దొండపాటి నాగేశ్వరరావు, గాలి దుర్గారావు, షేక్ వజీర్, ముడావత్ సైదా, జొన్నలగడ్డ ధనమూర్తి, ప్రేమానందం తదితరులు ఉన్నారు.

'త్వరగా చేతికొచ్చే పంటలను సాగుచేయాలి'

వీసీలో పాల్గొన్న వ్యవసాయ శాఖ అధికారులు

కూసుమంచి, జూలై 9: త్వరగా చేతికొచ్చే పంటలను సాగు చేసేందుకు రైతులు ప్రాధాన్యమివ్వాలని వ్యవసాయ శాస్త్రవేత్తలు సూచించారు. అలాగే ఆయా పంటలను కాపాడుకునేందుకు కూడా తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. 'వానకాలం సీజన్ పంటల విషయంలో రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తలు – త్వరగా వచ్చే పంటల విధి విధానాలు' అనే అంశంపై కూసుమంచిలోని రైతువేదికలో ఇక్కడి వ్యవసాయ శాఖ అధికారులు, రైతులతో హైదరాబాద్ నుంచి వ్యవసాయ శాస్త్రవేత్తలు మంగళవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా వానకాలం పంటల్లో స్వల్పకాలికంగా వచ్చే పంటలు, వాటి ఉపయోగాల గురించి జగిత్యాల శాస్త్రవేత్త గోన్యానాయక్ వివరించారు. పంటల్లో కలుపు మొక్కల నివారణ చర్యల గురించి ప్రొఫెసర్ జయశంకర్ విశ్వవిద్యాలయం శాస్త్రవేత్త డాక్టర్ మాధవి వివరించారు. అలాగే, ఇక్కడి రైతుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఏడీఏ విజయ్‌చంద్ర, వ్యవసాయశాఖ అధికారులు రామడుగు వాణి, అరుణకుమారి, సీతారాంరెడ్డి, నాగేశ్వరరావు ఏఈవోలు, రైతులు పాల్గొన్నారు.

మెరుగైన వైద్యసేవలందించాలి: డీఎంహెచ్‌వో

ముదిగొండ, జూలై 9: ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వచ్చే రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని డీఎంహెచ్వో డాక్టర్ మాలతి సూచించారు. ముదిగొండలోని పీహెచ్‌సీను మంగళవారం ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. వైద్య సదుపాయాలపై ఆరా తీసి వైద్యాధికారులకు పలు సూచనలు చేశారు. మౌలిక వసతులు మెరుగ్గా ఉండాలని, రోగుల వెంట వచ్చిన వారికి ఇబ్బంది కలగకుండా ఏర్పాట్లు చేయాలని సూచించారు. ముఖ్యంగా గర్భిణులు ఆరోగ్యంపై జాగ్రత్తగా ఉండాలని సూచించారు. ఆసుపత్రిలో రికార్డులను పరిశీలించారు. పీహెచ్‌సీ వైద్యాధికారి అరుణాదేవి, సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్టాండ్‌లో బంగారు ఆభరణాలు చోరీ

సత్తుపల్లి, జూలై 9: సత్తుపల్లి ఆర్టీసీ బస్టాండ్‌లో బస్సు ఎక్కుతున్న ప్రయాణికురాలి బ్యాగులో ఉన్న 112 గ్రాముల బంగారు ఆభరణం అపహరణకు గురైంది. పెనుబల్లి మండలం లంకపల్లికు చెందిన మామిళ్ల వరలక్ష్మి సత్తుపల్లి పట్టణంలోని ఎస్‌బీఐలో 112 గ్రాముల బంగారు ఆభరణాలను మంగళవారం రిలీజ్ చేసుకొని ఇంటికి వెళ్తోంది. ఈ క్రమంలో బస్సు ఎక్కేందుకు బస్టాండ్ వెళ్లగా తన బ్యాగులోని బంగారం అభరణాలను గుర్తుతెలియని వ్యక్తులు అపహరించారు. దీంతో ఆమె సత్తుపల్లి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు అందినట్లు సత్తుపల్లి పట్టణ సీఐ టీ.కిరణ్ తెలిపారు.

రావిచెట్టుతండాలో ఇసుక నిల్వలు సీజ్

తిరుమలాయపాలెం, జూలై 9: మండలంలోని రావిచెట్టు తండాలో అక్రమంగా నిల్వ ఉంచి ఇసుక రాసులను మైనింగ్, రెవెన్యూ శాఖల అధికారులు మంగళవారం స్వాధీనం చేసుకున్నారు. కొందరు అక్రమార్కులు రావిచెట్టు తండా వద్ద ఆకేరు నుంచి అక్రమంగా ఇసుక తవ్వకాలు జరిపి ఆ ఇసుకను తెచ్చి రావిచెట్టుతండా వద్ద నిల్వ ఉంచారు. ఇక్కడి నుంచి ట్రాక్టర్ల ద్వారా పట్టణాలకు తరలిస్తున్నారు. ఈ విషయంపై గ్రామస్తుల ఫిర్యాదు మేరకు మైనింగ్, రెవెన్యూ శాఖల అధికారులు మంగళవారం దాడులు నిర్వహించారు. ఏడు ప్రాంతాల్లో నిల్వ ఉంచిన 48 ట్రాక్టర్ల ఇసుకను సీజ్‌చేశారు. పట్టుబడిన ఇసుకను వేలం వేయనున్నారు. అధికారులు సంతోశ్, వీరయ్య పాల్గొన్నారు.

చికిత్సపొందుతూ వ్యక్తి మృతి

తిరుమలాయపాలెం, జూలై 9: రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన ఓ వ్యక్తి చికిత్సపొందుతూ మంగళవారం మృతిచెందాడు. పోలీసుల కథనం ప్రకారం.. మండలంలోని రాకాసితండాకు చెందిన బానోత్ వీరన్న (33) ఈ నెల 5 బైక్‌పై ఇంటికి వెళ్తూ తిప్పారెడ్డిగూడెం సమీపంలో అదుపుతప్పి కింద పడ్డాడు. తీవ్రంగా గాయపడిన అతడు.. ఖమ్మం ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్సపొందుతూ మంగళవారం మృతిచెందాడు. మృతుడికి భార్య మౌనిక, ఇద్దరు పిల్లలు ఉన్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఆంజనేయ ఆలయంలో అన్నదానం

మధిర రూరల్, జూలై 9: మండలంలోని ఆత్కూరు గ్రామంలో ఉన్న శ్రీ ఆంజనేయస్వామి దేవాలయంలో మంగళవారం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. దాతలు చావా ప్రదీప్, దేవిక దంపతులు ఆర్థిక సహకారంతో వెలగపూడి పూర్ణడాల్ కృష్ణ ఆధ్వర్యంలో ఈ అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటుచేశారు.

'చెట్లు ఉన్న ప్రాంతంలోనే ఆరోగ్యం'

పెనుబల్లి: ఇంటింటికీ మొక్కలు పంపిణీ చేస్తున్న సిబ్బంది

వాతావరణ కాలుష్యం నుంచి కాపాడడంతో పాటు మనకు ప్రాణవాయువును ఇచ్చే చెట్లు బాగా ఉన్న ప్రాంతాలోనే ప్రజలు ఆరోగ్యంగా, ఆనందంగా ఉంటారని ఏవో వాణి పేర్కొన్నారు. వనమహోత్సవం సందర్భంగా కూసుమంచి మండలం కేశ్వాపురంలో మంగళవారం రైతుల భూముల్లో ఆమె మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రైతులు పొలాల గట్లు, ఖాళీ ప్రదేశాల్లో నీడనిచ్చే చెట్లను నాటాలని కోరారు. అలాగే వన మహోత్సవంలో భాగంగా ఖమ్మం ప్రకాశ్‌నగర్ వైకుంఠధామంలో కాటి కాపరులు మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు. వన మహోత్సవంలో భాగంగా వైకుంఠధామంలో పెద్ద ఎత్తున మొక్కలు నాటినట్లు కాటి కాపరి జాంబవంతుడు సొసైటీ అధ్యక్షుడు చెరుకుపల్లి బాలు తెలిపారు. కార్పొరేటర్ గజ్జెల లక్ష్మి కాటి కాపరులను అభినందించారు. పెనుబల్లి మండలంలోని తాళ్లపెంటలో ఈజీఎస్, పంచాయతీ సిబ్బంది మంగళవారం ఇంటింటికెళ్లి మొక్కలు పంపిణీ చేశారు. తిరుమలాయపాలెం మండలంలోని జల్లేపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులు, ఉపాధ్యాయులు కలిసి పాఠశాల ఆవరణను శుభ్రంచేసి మొక్కలు నాటారు. **–కూసుమంచి/ రఘునాథపాలెం/ పెనుబల్లి/ తిరుమలాయపాలెం, జూలై 9**

రఘునాథపాలెం, కూసుమంచి, తిరుమలాయపాలెం మండలాల్లో మొక్కలు నాటుతున్న నాయకులు, అధికారులు, విద్యార్థులు, ఉపాధ్యాయులు

మన రాష్ట్రం మన పత్రిక
నమస్తే తెలంగాణ
నమస్తే తెలంగాణ దినపత్రికలో
చందా కొరకై మరియు పత్రికా పంపిణీలో
ఏమైన సమస్యలు ఉంటే సంప్రదించగలరు
సెల్ : 9182777073
నమస్తే తెలంగాణ దినపత్రికలో అన్ని రకాల
ప్రకటనలు (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు సంప్రదించగలరు
సెల్ : 9182777616

రిటర్న్ టికెట్ బుక్ చేసుకుంటే 10 శాతం రాయితీ

సత్తుపల్లి టౌన్, జూలై 9: ఆర్టీసీ బస్సుల్లో రిజర్వేషన్ చేయించుకున్న ప్రయాణికులు రిటర్న్ జర్నీ టికెట్ కూడా ముందుగానే రిజర్వేషన్ చేయించుకుంటే చార్జీలో 10 శాతం రాయితీ కల్పించినట్లు సత్తుపల్లి డీఎం రాజ్యలక్ష్మి తెలిపారు. స్థానిక డిపోలో మంగళవారం ఆమె మాట్లాడుతూ.. ప్రయాణికులు ముందస్తు రిజర్వేషన్ చేయించుకునే సమయంలో తిరుగు ప్రయాణానికి కూడా ఒకేసారి రిజర్వేషన్ చేయించుకుంటే 10 శాతం రాయితీ లభిస్తుందని తెలిపారు. అలాగే, సత్తుపల్లి – విజయవాడ రూట్‌లో డీలక్స్ బస్సుల్లో ప్రయాణించే మహిళలు తమ ప్రయాణం పూర్తయిన తర్వాత టికెట్ వెనుక పేరు, ఫోన్ నెంబర్ రాసి డ్రైవర్ వెనుక భాగంలో ఏర్పాటు చేసిన లక్కీడిప్ బాక్స్‌లో వేయాలని సూచించారు. ప్రతి 15 రోజులకొకసారి లక్కీడ్రాలో ముగ్గురు మహిళలను ఎంపిక చేసి వారికి బహుమతులు అందజేస్తామని పేర్కొన్నారు.

భూ తగాదాపై కేసు నమోదు

ఖమ్మం రూరల్, జూలై 9: భూతగాదా పంచాయితీపై స్థానిక పోలీసు స్టేషన్‌లో మంగళవారం కేసు నమోదైంది. ఖమ్మం రూరల్ ఎస్సై రామారావు కథనం ప్రకారం.. మండలంలో వెంకటగిరి పంచాయతీ పరిధిలో దేవరగట్ల విష్ణుమూర్తికి చెందిన వెంచర్‌లోకి అదే గ్రామానికి చెందిన దగ్గుపాటి రమాదేవి, దగ్గుపాటి వెంకటేశ్వర్లు, దగ్గుపాటి శిరోమణిలు ఈ నెల 9న సాయంత్రం అక్రమంగా ప్రవేశించారు. వెంచర్‌ను దున్నారు. ఈ విషయంపై విష్ణుమూర్తి ప్రశ్నింగా.. అట్రాసిటీ కేసు పెడతామంటూ బెదిరించారు. ఈ క్రమంలో దేవరగట్ట విష్ణుమూర్తి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

మధ్యాహ్న భోజన కార్మికుల ధర్నా

మధిర రూరల్, జూలై 9: తమ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ మధ్యాహ్న భోజన కార్మికులు సీఐటీయూ ఆధ్వర్యంలో మధిర ఎంపీడీవో కార్యాలయం ఎదుట మంగళవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ నాయకుడు శీలం నర్సింహారావు మాట్లాడుతూ.. మధ్యాహ్న భోజన వర్కర్లకు తక్షణమే పెండింగ్ బిల్లులు చెల్లించాలని, వంట సామగ్రి, గ్యాస్ అందించాలని, ఇతర సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. మధ్యాహ్న భోజన కార్మికులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుడి మృతికి జడ్పీ చైర్మన్ నివాళి

ఎర్రుపాలెం, జూలై 9: మండల కేంద్రమైన ఎర్రుపాలేనికి చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయుడు పెరుమాళ్ల శ్రీనివాసరావు సోమవారం అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న జడ్పీ చైర్మన్ లింగాల కమల్‌రాజు మంగళవారం శ్రీనివాసరావు నివాసానికి వెళ్లి అతడి భౌతికకాయాన్ని సందర్శించి నివాళులర్పించారు. కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. నివాళులర్పించిన వారిలో బీఆర్ఎస్ నాయకులు పంబి సాంబశివరావు, శ్రీపాల శెట్టి తిరుపతిరావు, గద్దల శ్రీనివాసరావు, సగ్గర్తి కిశోర్‌బాబు, ఇనుపనూరి భాస్కర్, దేవరకొండ రవి, ఇతర ప్రజాప్రతినిధులు, నాయకులు ఉన్నారు.

కేజీబీవీని పరిశీలించిన గర్ల్స్ చైల్డ్ డీవో

ఎర్రుపాలెం, జూలై 9: ఎర్రుపాలెం కేజీబీవీ పాఠశాలను గర్ల్స్ చైల్డ్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ (డీవో) భూలక్ష్మి మంగళవారం పరిశీలించారు. 'భోజనం ఎలా ఉంది? పాఠశాల పరిసరాలు పరిశుభ్రంగా ఉన్నాయా? లేవా?' అనే విషయాలను పరిశీలించారు. విద్యార్థినులకు తెలంగాణ ప్రభుత్వం అందిస్తున్న పాఠ్య పుస్తకాలు, నోట్ పుస్తకాలు, యూనిఫాంలను పరిశీలించారు. సరిపడినన్ని లేకపోతే తిరిగి పంపిస్తామని తెలిపారు. ఎస్‌వో సరిత, టీచర్లు పాల్గొన్నారు.

రేపు చేగొమ్మలో వెదురు, సరుగుడు చెట్ల వేలం

కూసుమంచి, జూలై 9: కూసుమంచి మండలం చేగొమ్మ ఉద్యానవనంలోని వెదురు, సరుగుడు చెట్లకు బుధవారం ఉదయం 11 గంటలకు వేలం వేయనున్నట్లు ఉద్యానవన అధికారి అపర్ణ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. నర్సరీలో 500 సరుడుగు, 300 వెదురు చెట్లు ఉన్నాయన్నారు. వేలంలో పాల్గొనాలనుకునే వారు రూ.5000 డిపాజిట్ చేయాలని సూచించారు.

వివాహిత ఆత్మహత్య కేసులో ఇద్దరు అరెస్ట్

ఖమ్మం రూరల్, జూలై 9: వివాహిత ఆత్మహత్య కేసులో ఇద్దరిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించిన ఘటన ఖమ్మం రూరల్ మండలంలో మంగళవారం చోటుచేసుకుంది. ఎస్సై రామారావు కథనం ప్రకారం.. మండలంలోని మద్దులపల్లి గ్రామానికి చెందిన షేక్ జుబేరియా ఈ నెల 7న అదే గ్రామంలోని తన ఇంట్లో ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. అందుకు ప్రధాన కారణమైన ఆమె భర్త నజీర్, అత్త బేగంలను రి